17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
ఆదివారం | 16 జూన్ 2024 | పేజీలు 10

ఎన్నికల సమయంలో

# సమర్థవంతంగా విధులు నిర్వహించారు..

**అందరి సహకారంతోనే రాష్ట్రంలో శ్రీ సత్యసాయి జిల్లాకు మంచి పేరు వచ్చింది..**

**ఎన్నికల విజయవంతంలో మీ కృషి ఎనలేనిది.**

**అందరికీ అభినందనలు తెలిపిన శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి**



పుట్టపర్తి క్రైమ్ మేజర్ న్యూస్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా పోలీస్ శాఖ యంత్రాంగం సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని మీ అందరి సహకారం వల్లే ఎన్నికలు విజయవంతం అయ్యాయని, అందరికీ అభినందనలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలియజేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో, సెబ్ కమిషనర్ పంపిన ప్రశంసా పత్రాలను సెబ్ అధికారులతో పాటు సిబ్బందికి అందజేశారు. అదేవిధంగా, ఎస్పీ ఎలక్షన్ సెల్ ఎస్బి శాఖకు పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి , 60 మందికి ప్రశంస పత్రాలు , రివార్డ్స్ ను ఎస్పీ అందజేసి వారిని అభినందించారు.

**ఎస్పీ ప్రోత్సాహం.. సూచనలతోనే...**

తాము ఎన్నికలలో సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు మా ఎస్పీ ఆత్మస్థైర్యం నింపడంతో పాటు , ప్రతి విషయాన్ని ఎంతో ఓపికతో విధులు నిర్వహించే విషయాలలో

మిగతా 2లో

బక్రీద్ పండుగ సందర్భంగా

# భద్రతా చర్యలు చేపట్టండి

**జిల్లా ఎస్పీ గౌతమిశాలి**

**జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టండి**

**పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోండి**

**జిల్లాలోని ముస్లిం సోదర సోదరీ మణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ**



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ గౌతమిసాలి ఆదేశిఒచారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అంతేకా కుండా..అన్ని మతాలవారితో పీస్ కమిటీ సమావే శాలు నిర్వహించి పండుగ ప్రశాఒతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరి మనోభావాలు మరొకరు గౌరవించేలా మరియు పండుగ సందర్భంగా ఎలాంటి అపోహలకు తావివ్వొద్దని సూచిస్తూ ప్రజలకు తమ స్థాయిలో అవగాహన కల్పించేలా పీస్ కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేయాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్స్టా గ్రామ్‌తో సహా ఏదైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఏవైనా అభ్యంతరకరమైన పోస్ట్ షేర్ చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జంతు వధశాలల వద్ద నీటి సమస్య, పారిశుద్ధ్యం,

మిగతా 2లో



కార్పొరేట్ స్థాయి

# వైద్యాన్ని అందిస్తాం

**ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్**

**గత ప్రభుత్వ హయాంలో వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు**

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన వారు శనివారం ప్రత్యేకంగా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పేద రోగులకు అందిస్తున్న వైద్యంపై ప్రత్యేకంగా వారు పరిశీలించారు. ఆసుపత్రికి చేరుకున్న వారిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంవోలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ లు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు గైనిక్ వార్డును పరిశీలించారు. గైనిక్ వార్డులో ఉన్న రోగులను ప్రత్యేకంగా మాట్లాడారు. వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి దృష్టికి గత ప్రభుత్వ హయాంలో గర్భిణీలకు అందించే కిట్లను అందించలేదన్నారు. తమ ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతుందని తెలిపారు. వారు అక్కడ ఉన్న చిన్నారులను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఆసుపత్రి పై ప్రత్యేక దృష్టి ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి

మిగతా 3లో



విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా

# సకల సౌకర్యాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**

అనంతపురం, మేజర్ న్యూస్ : గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్ లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, సకల సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని నాయక్ నగర్ లో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్ లో గదులన్నీ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు అందుబాటులో సిద్ధంగా ఉంచాలని, గదుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హాస్టల్లో రికార్డులన్నీ అప్డేట్ చేసి పెట్టుకోవాలన్నారు. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు హాస్టల్ కు వచ్చేలా ఫోన్లు చేసి పిలిపించాలన్నారు. హాస్టల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పల్లకి సేవ

**ఉరవకొండ, మేజర్ న్యూస్ :**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పల్లకీ సేవ అత్యంత వైభవంగా బాజా భజంత్రీల నడుమ వేడుకగా నిర్వహించారు. ఆలయ అధికారి కె. విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ చార్యుల పర్యవేక్షణలో అర్చకులు మయూరం బాలాజీ చార్యులు శనివారం వేకువ జామునే నరసింహ స్వామి మూలమూర్తికి విశిష్ట పూజలు జరిపారు. స్వామివారికి పంచామృత అభిషేకం, సుగంధ పుష్పాల అలంకరణ, విశేష అర్చనలు, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలను

మిగతా 2లో



## తాగు నీటిలో క్రిమిసంహారక మందు .. తప్పిన ప్రాణ నష్టం

### రాజకీయ కోణంలో విచారణ చేపట్టిన పోలీసులు



**కనేకల్లు, మేజర్ న్యూస్ :** ప్రజలు తాగే వాటర్ ప్లాంట్ లో గుర్తు తెలియని వ్యక్తులు క్రిమిసంహారక మందులు కలిపి ప్రాణాలను బలి కొనడానికి చూసిన సంఘటన కనేకల్ మండలం తుంబిగనూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కనేకల్లు మండలం తుంబిగనూరులోని వాటర్ ప్లాంట్ ను కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు సందర్శించారు. డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌లో క్రిమి సంహారక మందు కలిపినట్లు వైరల్ కావడాన్ని సీరియస్ గా తీసుకున్న జిల్లా ఎస్పీ గౌతమిసాలి ఐపీఎస్ ఘటనపై లోతుగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు సూచించారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు నిన్న రాత్రి ఈ ఘటనకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు గమనించకుండా త్రాగునీరు సేవించినచో ప్రాణం నష్టం మరియు ఆస్పత్రి పాలు అయ్యేవారు, పెద్ద ప్రమాదమే తప్పిందన్నారు. చాగంటిలో క్రిమిసంహార ముందు కలిపిన వైనం చూస్తుంటే ఎందుకిలా చేశారు, ఊరి ప్రజలపై ఇలా ప్రాణ లపై చెలగాటమాడడం ఎవరికి ఏం అవసరం ఉంది. రాజకీయ కోణంలో కూడా ఏమైనా దుండగులు ఈ పని చేసి ఉంటారేమోనని రాజకీయ కోణంలో కూడా పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ దుర్గం డిఎస్పి శ్రీనివాసులు, కనేకల్ ఎస్సై శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

## సమర్థవంతంగా విధులు నిర్వహించారు..

⏩ మొదటి పేజీ తరువాయి

ఎస్పీ గారు మాకు ఇచ్చిన సూచనలు ఎంతో ధైర్యాన్ని కల్పించా యని, అందువల్లే ఎన్నికల్లో బాగా విధులు నిర్వహించేందుకు ఉపయోగపడ్డాయని, పలువురు పోలీస్ అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్పీ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాల జారీచేయడం వలనే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని పోలీస్ అదికారులు ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఐపీఎస్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించారని ,జిల్లా పోలీస్ శాఖ యంత్రాంగం సమిష్టిగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్లనే నామినేషన్ల ప్రక్రియ,ఎన్నికల ఎన్నికల వేళా, ఎన్నికల కౌంటింగ్, ఫలితాల అనంతరం కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్నికలు జరిగాయని, ప్రధానంగా జిల్లాకు కర్ణాటక బోర్డర్ ఉండడంవల్ల నిరంతరం చెక్పోస్టుల్లో సిబ్బంది 24/7 విధులు నిర్వహించారని, సెబ్ , అధికారులు సిబ్బంది నిఘా పెట్టడం వల్ల పూర్తిగా కర్ణాటక లిక్కర్ నగదు వంటివి వాటికి పూర్తిగా అడ్డుకట్ట వేయగలరామన్నారు .

### ఎలక్షన్ సెల్.. ఎస్బి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ ..



ఎన్నికలకు ఎలక్షన్స్ సెల్, ఎస్బి శాఖ అప్రమత్తంగా పనిచేస్తూ ప్రతి సమాచారం ఎప్పటికప్పుడు సరైన టైంలో ఇవ్వడం జరిగిందని వీటివల్ల ఎన్నికల కమిషన్ కు సరైన సమయంలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపగలిగి జిల్లాలో గర్వంగా చెప్పుకునే పరిస్థితులు కల్పించారన్నారు. ఎలక్షన్ సెల్ సీఐ విక్రమ్, ఎస్బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ వారి సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో పోలింగ్ రోజు కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. ముందుస్తుగా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నప్పటికీ అక్కడక్కడా చెదురుమొదురు ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ పోలీస్ అదికారులు వేగంగా స్పందించి శాంతిభద్రతలను పరిరక్షించారన్నారు. పోలీస్ అధికారులను అప్రమత్తం చేసి శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మొబైల్ యాప్" ఎంతగానో ఉపయోగపడిందని దీనివలన ఎక్కడైనా ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే మొబైల్ పార్టీ లు, ప్రత్యేక ఫోర్స్ లను అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి చేరుకునే విధంగా చర్యలు వాటిని నిలవరించగలిగామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ, అడ్మిన్, విష్ణు , సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, ఈ.ఎస్ సుబ్రహ్మణ్యం , తమ విధులను బాగా నిర్వర్తించారని, వీరందరి సహకారంతోనే జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగావిజయవంతం ముగిసే విధంగా సమిష్టితో పనిచేశామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ సందర్భంగా సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, ఈ.ఎస్. సుబ్రహ్మణ్యం, ఎలక్షన్ సెల్ సీఐ విక్రమ్ ,ఎస్బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ సీఐ,ఎస్ఐలు సిబ్బందికి ఎస్పీ ప్రశాంత పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎన్ విష్ణు, సెబ్ ,అడిషనల్ ఎస్పీ నాగభూషణం, ఈఎస్ సుబ్రహ్మణ్యం , ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిఐ విక్రమ్ ఎస్బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## మలేరియా సోకకుండా గ్రామంలో విస్తృత అవగాహన

### రాకెట్లలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** మలేరియా, డెంగ్యూ లాంటి విష జ్వరాలు ప్రాణాంతకమని, వాటి మూలాలు మురికి నీటి నిల్వల వద్ద ఉన్న లార్వాలు దోమలుగా ఎదగడమేనని, వాటి నిర్మూలనకు ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో మలేరియా వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ మలేరియా విష జ్వరం దోమకాటు తో వస్తుందని సూచించారు. తమ ఇళ్ల వద్ద పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. దోమ పుట్టకుండా, దోమ కుట్టకుండా జాగ్రత్తలు అను సరిస్తే జ్వరాలు ప్రభలే అవకాశం ఉండదన్నారు. తొలుత చలిగా అనిపించి తరువాత అధికంగా జ్వరం వచ్చి చమటలు పట్టి జ్వరం తగ్గిపోతే అది మలేరియా జ్వరం లక్షణంగా గుర్తుంచుకోవాలన్నారు. అలాంటి లక్షణాలు సోకిన వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలని లేదంటే జ్వరం ప్రభావం మెదడుకు చేరి మరణం సంభవించే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. దోమ కుట్టకుండా దోమతెరలు వాడటం, మస్కిటో కాయిల్స్ వినియోగించడం, సాయంత్రం వేళ వేపాకు పొగ వేసుకోవడం లాంటి చర్యలు చేపట్టాలన్నారు. రాత్రిపూట తలుపులు మూసి దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురికినీటి నిల్వల వద్ద ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చని సూచించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నాగ రంగయ్య, ఆరోగ్య విద్యా బోధకులు ఎస్. ఎండి షఫీ, సూపర్వైజర్లు స్వర్ణలత, శేఖర్, సీవో భగవాన్ దాస్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'అంగన్వాడీ పిలుస్తోంది'



**పామిడి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో శనివారం అంగన్ వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతు లు, చిన్నా రులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయంతి, సేకునీ, యశోద, హెల్పర్లు కీర్తి, మాబున్ని, దుర్గమ్మ, గర్భవ తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం హర్షనీయం : బిఎస్ కృష్ణారెడ్డి



**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడంతో గుత్తి కోర్టు ఆవరణముందు గుత్తి న్యాయవాదులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ కృష్ణారెడ్డి హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి లీగల్ సెల్ నాయకులు సోమశేఖర్, సీనియర్ న్యాయవాదులుమనోహర్ న్యాయవాదులు ప్రజలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నాటి బాలలే రేపటి పౌరులు

### ఐసిడిఎస్ సూపర్ వైజర్ పుష్ప

**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** గుంతకల్లు మండల పరిధిలోని కసాపురం 1 ఎడబ్ల్యుఎస్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పుష్ప



ఆధ్వర్యంలో 'అంగన్‌వాడి పిలుస్తోంది' కార్యక్ర మం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రాల ద్వారా మాతా, శిశువులకు అందించే సేవలు వివరిస్తు ఈ నాటి బాలలే రేపటి పౌరులు అవుతారని 3సంవత్సరాలు నిండిన పిల్లలందరిని ఎడబ్ల్యుసిలో చేర్పించాలని, పిల్లలకు ఆట, పాటల ద్వారా నర్సిరీ, ఎల్‌కేజి, యుకెజి క్లాసులను నిర్వహిస్తున్నామని, కాన్వేంట్ దీటుగా పిల్లల చదువు చెప్పిస్తున్నామన్నారు. చదువుతో పాటు పౌష్టికాహారం గుడ్లు, పాలు, మద్యాహ్న భోజనం, పెడుతున్నామని, ఖర్చు లేకుండా పిల్లల భవిత బాగుపడుతుందని తల్లులకు తెలియజేశారు. అనంతరం తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మొక్కలు నాటించడం జరిగింది. 5సంవత్సరాలు నిండిన పిల్లలను ఎంపిపి స్కూల్లో చేర్పిస్తున్నామని, పిల్లలు నెర్చుకున్న విద్య, ఆట పాటల ద్వారా ఎలా నేర్చుకున్నారో పిల్లల తల్లులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడబ్ల్యుడబ్ల్యులు ఎస్తేరమ్మ, బి సుజాత, ఆదిలక్ష్మి, హెల్పర్లు, పిల్లల తల్లులు హజరయ్యారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పల్లకి సేవ

⏩ మొదటి పేజీ తరువాయి

అందజేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి వారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో కొలువు ధీర్చారు. సతీ సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు ఆచరించి తదుపరి స్వామివారిని మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఆలయము చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. తదనంతరం శ్రీవారికి ప్రాకారోత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులను భక్తుల దర్శనార్థం ఆలయ ముఖమండపంలో కొలువు దీర్చారు. మధ్యాహ్నం స్వామి దర్శనార్థం హాజరైన సమస్త భక్త జనానికి అన్నదాన సంతర్పణ కావించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గుండు రావ్, సత్య, రామకృష్ణ, సాయి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది మారుతి ప్రసాద్, దీపక్, రామకృష్ణ, రాఘవేంద్ర, దండా వెంకటేశులు, నరసింహులు, నాగేంద్ర సమస్త భక్త జనం పాల్గొన్నారు.

## భద్రతా చర్యలు చేపట్టండి

⏩ మొదటి పేజీ తరువాయి

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు.

### జిల్లాలోని ముస్లిం సోదర సోదరీ మణులకు బక్రీద్ శుభాకాంక్షలు

త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు ఎస్పీ బక్రీద్ పర్వదిన శు భాకాంక్షలు తెలియజేశారు.

## నల్లపల్లి విజయ్ భాస్కర్ సస్పెన్షన్ రద్దు పై హర్షం

### ఉపాధ్యాయున్ని ఘనంగా సన్మానించిన గ్రామస్తులు

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** కళ్యాణదుర్గం నియోజవర్గం కుందుర్పి మండలం మాయదార్లపల్లి లో పనిచేసే ప్రధాన ఉపాధ్యాయుడు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ సస్పెన్షన్ ను రద్దు పై మాయదార్లపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామం లోని ప్రాథమికొన్నత పాఠశాల విలీనం జరగకుండా ఉపాధ్యాయుడు విజయ్ భాస్కర్ క్రియాశీలకం గా వ్యవహరించారని, ఉద్యోగులు, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్య ల పరిష్కరం కోసం చాలా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమం లో గ్రామస్తులు రంగప్ప, గోపాల్, పెద్దన్న, తిప్పేస్వామి, మంజప్ప, చరణ్, మర్రిస్వామి, బొమ్మలింగప్ప, జనార్దన్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జరిగిన వలి స్వామి 13వ ఆరాధన



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : అనంతపురం నగరంలోనున్న వలి స్వామి ఆశ్రమం నందు శనివారం రోజు నిర్వహించిన సద్గురు వలి స్వామి 13వ ఆరాధన మహోత్సవం సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరిగినది. స్వామి సమర్ధ అక్కలకోట మహారాజ్ సేవా సమాజ్ కార్యవర్గ ప్రతి నిధులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము నిర్వహించారు, శనివారం ఉదయం బుక్కరాయసముద్రం మండలం పరిధిలోగల వెంకటాపురం గ్రామంలో ఉన్న సద్గురు వల్లి స్వామి సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు తర్వాత నగరంలోనున్న కొలహపూర్ మహాలక్ష్మి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ దేవతామూర్తులను స్మరిస్తూ భజన కార్యక్రమం నిర్వహించారు విద్యా నరసింహ భారతి స్వామి వల్లి స్వామి ఆశ్రమం పాలకమండలి ప్రధాన కార్యదర్శి దేవనూరు సుందరం విజయకుమార్ టిసి చిట్టా శ్రీధర్ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ విజయ సాయికుమార్ జయచంద్రా రెడ్డి కొండారెడ్డి సుధారాణి జొన్న శ్రీనివాసులు వై బాలాజీ సాయి జగదీష్ సుబ్రహ్మణ్యం కేదార్నాథ్ రాయుడు బాబు ఉమా సాయి హర్షిత్ రాజలక్ష్మి ఏ జీ ప్రమీలమ్మ శివమ్మ జయమ్మ లతా చలపతి రెడ్డి తదితరులు పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు భక్తులకు అన్నదానము మరియు వస్త్రధానము చేశారు.

## నల్లపల్లి విజయ్ భాస్కర్ సస్పెన్షన్ రద్దు..

### హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులు..




అనంతపురం విద్య మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ సస్పెన్షన్ ను అధికారులు ఎట్టకేలకు రద్దు చేశారు. నల్లపల్లి విజయ్ భాస్కర్ గతం లో ఇచ్చిన మాట మేరకు ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ ను రద్దు చేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని, ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందాలని, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆర్థిక బకాయిలు మంజూరు చేయాలని పత్రికల్లో డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ప్రకటన లు ఇవ్వడం ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు నల్లపల్లి విజయ్ భాస్కర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ సస్పెండ్ రాజ్యాంగ వ్యతిరేకం అని, ఉద్యోగులకు భావప్రకటన స్వేచ్ఛ లేదా అని ఉద్యోగులు ఆనాడే విమర్శించారు. ప్రస్తుతం నల్లపల్లి విజయ్ భాస్కర్ సస్పెన్షన్ ను ఎత్తేయడం పై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం



బెలుగుప్ప, మేజర్ న్యూస్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందుజిల్లా ఉన్న తా ధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఎంపీటీవో సుబ్బరాజు వివిధ కార్యక్రమాలపై శనివారంసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15వ ఆర్థిక కమిషన్ నిధుల, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలు, ప్రతి శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీలలో ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు చేపట్టుట ప్రతి 15 రోజులకు ఒకసారి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించుట, మొక్కలను పెంచుట, గ్రామ పంచాయతీలోని రికార్డులను అప్డేట్ చేయించుట మరియు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆర్డి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, జగదీష్, గోపాల్, పాండు, ప్రవీణ్ కుమార్, ఉమా, శంకర్, అశోక్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారికి ఆపన్న హస్తంలా ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్

**బోరంపల్లి డయాలసిస్ పేషెంట్‌కు రూ.15వేలు ఆర్థిక సహాయం**
**మూడు నెలలకు సరిపడా కిరాణా సరుకులు పంపిణీ**
**గ్రామ టిడిపి కమిటీ తరపున రూ.25వేలు సహాయం**



శెట్టూరు, మేజర్ న్యూస్ : కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన పశువుల వన్నూరుస్వామికి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. అస్పత్రిలు చుట్టూ తిరిగి ఉన్న ఆస్తి మొత్తం అమ్ముకుని అనాధగా మిగిలి ఆర్థికంగా పూటగడవ లేని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ వారు స్పందించి రోగికి రూ.15వేలు ఆర్థిక సహాయం చేసి, మూడు నెలల సరిపడు కిరణసరుకులు ఇవ్వడం జరిగింది. భవిష్యత్ లో కూడా మా సహాయ సహకారాలు ఉంటాయని వారి భరోసా ఇచ్చారు. గ్రామ టీడీపీ కమిటీ ఆర్థిక సహాయం బోరంపల్లి టిడిపి గ్రామ కమిటీ వెంకటేశులు, మారెప్ప, రంగారెడ్డి. మల్లికార్జున, రామాంజినేయులు, మల్లయ్య తదితరులు రూ.25వేలు ఆర్థిక సహాయం చేశారు.

### విద్యా హక్కు చట్టం

## అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### అఖిలభారత విద్యార్థి సమాఖ్య డిమాండ్

ఉరవకొండ, మేజర్ న్యూస్ : పట్టణముతో పాటు మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న ప్రవేట్ ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షులు హరూన్ రషీద్ డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రం వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, చార్జీల పేరుతో ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు నిలువు దోపిడీకి తెరతీసాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశిత ఫీజులను వసూలు చేయకుండా ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల



తల్లిదండ్రులను మోసగిస్తున్నారని విమర్శించారు. ప్రతి ప్రవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల వద్ద ఫీజుల వివరాలను ప్రదర్శించాలని కోరారు. పట్టణంలో ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని విద్యార్థి నాయకులు గుర్తు చేశారు. ప్రవేట్ పాఠశాలల అక్రమాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మండల విద్యాశాఖ అధికారి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇలాంటి ధోరణి సరైంది కాదని తెలిపారు. తక్షణమే విద్యా హక్కు చట్టం అమలుకు చర్యలు చేపట్టాలని, లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. సంబంధిత వినతి పత్రాన్ని మండల విద్యాశాఖ అధికారినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు కార్తీక్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడికి గాయాలు



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగర శివారులోని నేషనల్ పార్క్ వద్ద ఉన్న మద్యం గోడౌన్ వద్ద ప్రమాదవశాత్తు బీరు బాటిల్ పగిలి ఆదిశేషయ్య అనే కార్మికుడికి గాయాలైన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. దీంతో అతనిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## గ్యాస్ పేలి కార్మికుడికి గాయాలు



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని గుత్తి రోడ్డు లో ఉన్న పెట్రోల్ బంక్ లో ప్రమాదవశాత్తు ఫైర్ సేఫ్టీ గ్యాస్ సిలిండర్ పేలి మేనేజర్ శ్రీకాంత్ తీవ్ర గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. దీంతో అతనిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఒక్కసారిగా గ్యాస్ పేలడంతో అతని ముఖానికి తీవ్ర గాయాలైనట్లు వైద్యులు వెల్లడించారు. దీంతో అతనిని మెరుగైన వైద్య చికిత్సల కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### కార్పొరేట్ స్థాయి

## వైద్యాన్ని అందిస్తాం

▸▸ మొదటి పేజీ తరువాయి



చేస్తామన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించే ఏర్పాట్లను చేస్తామని తెలియజేశారు. తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన ప్రాజెక్టులకు సంబంధించి గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆసుపత్రి పరిధిలో వచ్చే వాటిని మంజూరు చేయించి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైద్యుల కొరత లేకుండా మందుల కొరత లేకుండా అత్యుత్తమ వైద్య సేవలను అందించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి వారం ఆసుపత్రిని పరిశీలిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పలు అంశాలను వారు పరిశీలించారు. ప్రస్తుతం 570 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 1200 పడకలుగా మార్చేందుకు ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. వైద్య సేవలను మరింత మెరుగైనగా చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రానున్న కాలంలో ఆసుపత్రిలో అత్యుత్తమ స్థాయి వైద్యాన్ని అందిస్తామని వారు ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, మాజీ మేయర్ స్వరూప, టి ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహులు, బుగ్గయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో అదుపుతప్పి బోల్తా .. డ్రైవర్‌కు గాయాలు

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : సింగనమల మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడి శాంతి రాజు అనే డ్రైవర్ కు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. సింగనమల నుంచి కొర్రపాడు కు కూలీల కోసం వెళ్లే ఆటో సింగనమలలో కుక్క అడ్డు రావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 108 సహాయంతో తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కృషి

### కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు హామీ



శెట్టూరు, మేజర్ న్యూస్ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేసే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే గా ఎన్నికైన సురేంద్రబాబును ప్రజా వేదిక దగ్గర జర్నలిస్టులు కలిసి అభినందించారు. ఈ సందర్భం గా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామీణ విలేకరుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఇంటి స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, నియోజకవర్గ కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం చేపట్టాలని, జర్నలిస్టుల కు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని వినతి పత్రం అందించారు. వీటన్నింటిని కూలంకషంగా విన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు తొలి ప్రాధాన్యంగా ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం పనులు మొదలు పెడదామని మిగిలిన సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు కరణం తిప్పేస్వా మి, నియోజకవర్గ అధ్యక్ష, ఆర్గనైజింగ్ కార్యదర్శులు డి రవీంద్ర, చంద్రశేఖర్, వలీసాబ్, హరినాథ్, నెపోలియన్, అనిల్, తిమ్మరాజు, నరసింహులు, ఇషాక్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

**జిల్లా ఎస్పీ చేతుల మీదుగా కార్పస్ ఫండ్,**
**విడో ఫండ్ కింద రూ. 1.50 లక్షల చెక్కుల అందజేత**



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : ఈ ఏడాది ఫిబ్రవరిలో మృతి చెందిన ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ (ఏ ఆర్ పీ సి 729) కుటుంబానికి కార్పస్ ఫండ్, విడో ఫండ్ ల కింద మొత్తం రూ. 1.50 లక్షల విలువ చేసే చెక్కులను జిల్లా ఎస్పీ గౌతమిసాలి మృతుడి భార్య రాధకు శనివారం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం బి సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

# పెరుగుతున్న షుగర్ వ్యాధి

## జాతీయ మధుమేహ వ్యాధి వారోత్సవాలు



**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** మధుమేహం అనేది ఇన్సులిన్ లోపం వల్ల శరీరంలోని జీవక్రియ అస్తవ్యస్తమైన స్థితి, దీని ఫలితంగా హైపర్గ్లైసీమియా మరియు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి అనిడాక్టర్. ఎం. వైభవ్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ కిమ్స్ సవీర, అనంతపురం తెలిపారు. టైప్ 1 వంటి వివిధ రకాల మధుమేహం ఉంటుంది. ఇది సాధారణంగా పూర్తి ఇన్సులిన్ లోపం కారణంగా యుక్త వయసులో ఉన్న వారిలో ఈ వ్యాధి పెరుగుతోంది. టైప్ 2 డయాబెటిస్ ఇన్సులిన్ వల్ల వస్తుంది. గర్భధారణ సమయంలో మధుమేహం ప్లాసెంటల్ హార్మోన్ల కారణంగా ఇన్సులిన్ నిరోధకత కారణంగా వస్తుంది. ఇతర రకాల మధుమేహం జన్యుపరమైన కారణాలు, ప్యాంక్రియాస్ సమస్యలు, హార్మోన్ల అదనపు స్థితి మరియు ఇతర అరుదైన రకాలు. భారతదేశంలో మధుమేహం యొక్క ప్రాబల్యం 11.4% గా ఉంది. దాదాపు 10.1 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. యుక్త వయసు ఉన్న వారిలో ఎక్కువగా ప్రభావ చూపుతోంది.

ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, కుటుంబ చరిత్ర, వయస్సు, నిశ్చల జీవనశైలి, పి.సి.ఓ.ఎస్ మరియు గర్భధారణ మధుమేహం టైప్ 2 డయాబెటిస్‌కు ముఖ్యమైన ప్రమాద కారకాలు.

మధుమేహం యొక్క లక్షణాలు అస్పష్టంగా ఉంటాయి, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ ఫెయిల్యూర్, రెటీనా డ్యామేజ్, న్యూరోపతి, అంగస్తంభన, కాలులో మానని గాయాలు, మరియు కాలు తొలిగించడం వంటి మధుమేహ సమస్యల నివారణకు అధిక-ప్రమాద జనాభాలో రక్తంలో చక్కెరలను క్రమం తప్పకుండా పరీక్షించడం చాలా ముఖ్యం.

టైప్ 2 డయాబెటిస్‌కు నిరోధించడానికి ప్రీ-డయాబెటిక్ దశలో ముందస్తు రోగనిర్ధారణ కోసం ప్రజలలో అవగాహన మరియు క్రమం తప్పకుండా రక్తంలో గ్లూకోజ్ పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యమైనది.

జీవనశైలిలో మార్పులు చేయాలి. 1)జాగింగ్, ఆటల ఆడటం మరియు కార్డియాక్ వర్కౌట్‌ల వంటి మితమైన తీవ్రతతో కూడిన వ్యాయామం. 2) కార్బోహైడ్రేట్‌లు మరియు కొవ్వు పదార్థాలను తగ్గించేటప్పుడు ప్రోటీన్ మరియు ఫైబర్ కంటెంట్‌ను పెంచడం వంటి ఆహార మార్పులు 3) బరువును 5-10% తగ్గిస్తాయి 4) సరైన నిద్ర 7-9 గంటలు 5) ఒత్తిడి స్థాయిలను తగ్గించడం 6) ధూమపానానికి దూరంగా ఉండటం. మధుమేహం ఏర్పడిన తర్వాత, వారికి చికిత్స చేసే వైద్యులను క్రమం తప్పకుండా కలవాలి. వారు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. మధుమేహం యొక్క సరైన నియంత్రణ కోసం ఇన్సులిన్‌లతో పాటు అనేక ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయి. మన జాతీయ సగటు 9.1%కి వ్యతిరేకంగా హెచ్.బి.1.సి 7% లోపు ఉండాలి. ఆసుపత్రిలో చేరడం మరియు మధుమేహం సంబంధిత మరణాలను నివారించడానికి జాతీయ హెచ్.బి.1.సిసగటును తగ్గించాల్సిన అవసరం ఉంది.



# పోలీస్ స్టేషన్‌లో మూలన పడ్డ ఎండియు వాహనాలు..

## జగన్ ఫోటోకు స్టిక్కర్లు...

**కూడేరు, మేజర్ న్యూస్:** ఇంటి వద్దకే రేషన్ అంటూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వ్యయం చేసి ఎండియు వాహనాలను కొనుగోలు చేసింది. వాటి ద్వారా ఇంటింటికి రేషన్ అందించాలన్నది అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పం. డీలర్ వ్యవస్థ స్థానంలో ఎండియు ఆపరేటర్కు 20 వేలు వేతనం చెల్లిస్తూ.. రేషన్ పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే నిర్వహణ లోపం కారణంగా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విఫల ప్రయత్నం గా మిగిలిపోయింది. ఇంటి వద్దకే రేషన్ అందించాల్సిన ఆపరేటర్ ఎక్కడో వీధి చివరన వాహనం పెట్టుకుంటే అక్కడికి వెళ్లి లబ్ధిదారులు రేషన్ పొందాల్సి వచ్చింది. ఎండియు వాహనం ఎప్పుడొస్తుందో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఆ వాహనం వచ్చినప్పుడు అందుబాటులో లేకపోతే అనేక సందర్భాల్లో లబ్ధిదారులకు రేషన్ ఆ మాసంలో కట్ అయిన దాఖలాలు కోకొల్లలు. ఈ క్రమంలోనే అనేకమంది డీలర్లు హైకోర్టును సైతం ఆశ్రయించారు. తాజాగా నూతన ప్రభుత్వం కొలువు తీరడంతో తిరిగి డీలర్ల వ్యవస్థ ఊపిర్లు పోసుకుంటోంది. ఇక కూడేరు మండలంలో ఇప్పటికే ఎండియు వాహనాలు పోలీస్ స్టేషన్ కు చేరాయి. ఆ వాహనాలకు ఉన్న స్టిక్కర్లకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోటో కనిపించకుండా పచ్చ రంగు స్టిక్కర్ అతికించడం కనిపించింది. ప్రభుత్వం తిరిగి డీలర్ వ్యవస్థ ద్వారానే రేషన్ పంపిణీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# క్యాన్సర్ వ్యాధి నివారణ అందరి బాధ్యత

## డా. ఈ.బి.దేవి .డియంహెఛ్ఓ




**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ. కార్యాలయంలో జిల్లాలోని మొత్తం వైద్యాధికారులకు , సిహెచ్ఓలకు, అర్బన్ ఏఎన్ఎం లకు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యంగా రొమ్ము, నోరు, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ లపై అవగాహన కల్పించారు. తదుపరి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కి వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. ఈబీ దేవి గారు మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరూ స్వీయ రొమ్ము పరీక్ష చేసుకోవడం నేర్చుకోవాలి. అలాగే దుర్వాసనతో కూడిన తెల్లబట్ట వంటి లక్షణాలున్నప్పుడు వెంటనే తగిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.అలాగే మగవారు ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులను సేవించేవారు నోటిలో ఎటువంటి పుండ్లు ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలి. తద్వారా ప్రాథమిక దశలోనే క్యాన్సర్ అనుమానిత లక్షణాలను గుర్తించినచో చికిత్స సులభతరం అవుతుంది అలాగే ఆరోగ్యకర జీవనశైలితో పాటు జీవితకాలం పొడిగించబడుతుంది అన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి నారాయణస్వామి మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళ సర్వైకల్ స్క్రీనింగ్ పరీక్ష మరియు 18 సంవత్సరములు పైబడిన ప్రతి ఒక్కరూ స్వీయ రొమ్ము పరీక్ష పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రంలో క్యాన్సరుకు సంబందించిన. అవగాహన కొరకు బుక్ లెట్స్. విడుదల చేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, సిహెచ్ లు అనుమానిత కేసులను తదుపరి పరీక్షలకు వైద్యాధికారులకు సంప్రదించి స్క్రీనింగ్ నిర్వహించాలి అనుమానిత కేసులను లేదా నిర్దేశిత లక్షణాలున్న కేసులను ప్రివెంటవ్ ఆంకాలజీ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కు పంపించాలి. ఈ కార్యక్రమంలో సెకండరీ హెల్త్ నుంచి దంత వైద్యులు, మహిళ ప్రత్యేక వైద్య నిపుణులు, జిల్లా క్యాన్సర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, డిస్టిక్ ట్రైనర్స్ డాక్టర్. ప్రమోద్, డాక్టర్ కుముదా, ఉదయభాను, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రాజేంద్ర ,డాక్టర్, మహేంద్ర నాథ్ ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఏఎన్ఎంలు సిహెచ్ఓ లకు ట్రైనింగ్ ఇచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత ,డిపిఎమ్ఓ. రవిశంకర్ పాల్గొన్నారు అలాగే ఈ కార్యక్రమానికి ఎన్సిడి వైద్య సిబ్బంది ఆంజనేయులు, మౌనిక ,శశికళ, కిషోర్ కుమార్ పాల్గొన్నారు

# బక్రీద్ పండుగ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

## • జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

**• జిల్లాలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టాం • జిల్లా ఎస్పీ గౌతమి శాలి**



**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టర్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 17న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా చేపట్టాల్సిన సన్నాహక ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా ఎస్పీ గౌతమి శాలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకొనేందుకోసం ఈద్గా పరిసరాలన్నీ శుభ్రం చేయాలని, అక్కడ వసతిని కల్పించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షణ చేయాలన్నారు. కబేళాల దగ్గర గోవధ చేయరాదని తెలిపారు. ముస్లిం సోదరులకు బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గాలు, మసీదు, దర్గాల వద్ద పారిశుధ్య సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, నిరంతర నీటి సౌకర్యం కల్పించాలన్నారు. మాంసపు వ్యర్థాలను రవాణా చేయడానికి మరియు డంపింగ్ చేయడానికి మున్సిపల్ వాహనాలను అందించాలన్నారు. 17.06.2024 నుండి 19.06.2024 వరకు మూడు రోజుల పాటు కబేళాల వద్ద నీటి సౌకర్యాన్ని అందించడానికి అనంతపురం మునిసిపల్ కమీషనర్ తో సమన్వయం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జెడిని ఆదేశించారు. మాంసం దుకాణాలను తనిఖీ చేయాలని మరియు మాంసం దుకాణ యజమానులకు ఆహార ధృవీకరణ/వాణిజ్య లైసెన్సు జారీ చేయాలన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకోసం తహసిల్దార్లు మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గౌతమి శాలి మాట్లాడుతూ జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని, జూన్ 17వ తేదీ బక్రీద్ పండుగను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. పొలాలు/బహిరంగ ప్రాంతాలలో జంతువుల రవాణాను అడ్డుకోవడం, శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే దుండగులపై నిఘా ఉంచాలన్నారు. మార్కెట్ యార్డులు, ఈద్గాలు, మసీదులు మరియు కబేళాల వద్ద పార్కింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రవాణా సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈద్గాలు, మసీదులు, దర్గాలు, మార్కెట్ యార్డులు మరియు కబేళాల ప్రదేశాలకు సమీపంలో పోలీసు బందోబస్త్ నిర్వహించాలన్నారు. పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవో రాణి సుస్మిత, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, ఎస్డిసి ఆనంద్, డిపిఓ ప్రభాకర్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, పబ్లిక్ హెల్త్ సతీష్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, ఏపీఎస్పీడీసీఎల్ ఏడి వివేకానంద స్వామి, తహసీల్దార్ శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులు, పింఛన్ దారులకు అండగా తెలుగుదేశం ప్రభుత్వం

**రాష్ట్రం కలలు కన్న రోజులు వచ్చాయి**

**ఐదు హామీలపై సీఎం బాబు సంతకం**

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు - ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు**

**చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే అమిలినేని**



**శెట్టూరు, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రజావేదికలో డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు, నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన అభ్యర్థులు, వికలాంగులు, పింఛన్ దారులతో కలసి కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ మన రాష్ట్రం కలలు కన్న రోజులు వచ్చాయని, ఇక నుంచి నిరుద్యోగులు కానీ, ఉన్నత చదువులు చదివి సరైన ఉద్యోగాలు రాకుండా ఉన్న వారు అంగవైకల్యంతో బాధపడే వారు, వృద్దులు ఏమాత్రం బాధపడకుండా వారికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వారి కోసమే మొదటి ఐదు సంతకాలు చేయడం చాలా గొప్ప విషయమని, ఎన్నికల ముందు చెప్పిన ప్రకారం డీఎస్సీ పై మొదటి సంతకం చేయడం హర్షనీయమన్నారు. దాదాపు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసేందుకు చేసిన సంతకం ఉద్యోగఅవకాశాల కోసం ఎదురు చూస్తున్న యువత కళ్ళలో ఆనందం కన్పిస్తోందన్నారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎలాంటి ఉద్యోగావకాశాలు లేక నిరుత్సాహంలో ఉన్న యువత ఎన్నికల సమయంలో ముందుకు రావడం చాలా సంతోషం. 53 రోజులు జైలులో పెట్టి హింసించినా బెధరకుండ రాష్ట్రం కోసం పనిచేసి చంద్రబాబు నాయుడు గారు ఇంతటి గొప్ప విజయాన్ని అందుకున్నారని, మంత్రులుగా ఎన్నికైన అందరికి మన ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులకు కళ్యాణదుర్గం ప్రజల తరుపున అభినందనలు అని, డీఎస్సీ అభ్యర్థులు స్వచ్ఛందంగా వచ్చి చంద్రబాబు నాయుడుకు పాలాభిషేకం చేయడం హర్షనీయం అన్నారు.

## ఊయల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

### – జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పోలిపల్లి వినూత్న



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : ఊయల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పోలిపల్లి వినూత్న పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నగరం లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లోని ఆలయం వద్ద, సచ్చి వన్ స్టాప్ సెంటర్‌లో ఆమె ఊయల కార్యక్రమాన్ని ఐసిడిఎస్ పిడి శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఊయల కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రద్దీ ప్రాంతాలలో ఊయలను ఉంచడం జరుగుతుందని తెలిపారు. చిన్నారులను పారివేయకుండా వారిని ఊయలలో ఉంచితే ఐసిడిఎస్ ద్వారా వారిని ప్రత్యేక వసతి గృహంలో భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. చిన్నారులు అనాచలుగా ఇతర ఇబ్బందులతో వారు మరణించకూడదని ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నారులను కుప్ప తొట్టిలలో ఇతర ప్రాంతాలలో వేసి వెళుతున్నారని వాటిని పూర్తిగా నివారించేందుకు ఈ ఊయల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమె సఖి వన్ స్టాప్ సెంటర్ కు సంబంధించి సమాజంలో వాటి పనితీరుపై సంబంధిత సిబ్బంది అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ కు వచ్చే ప్రతి ఒక్కరికి ఎ న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉ పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్‌కు ఆత్మీయుల ఘన సన్మానం..



గోరంట్ల, మేజర్ న్యూస్ : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్‌ను కెంపుల ఫంక్షన్ హాల్ అధినేత డీకే శ్రీనివాసులు, తదితరులు ఘనంగా సన్మానించారు. స్వచ్ఛంద సంస్థ అధినేత బీసీ రెడ్డి స్వగృహంలో జిల్లా అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. జిల్లాలో విస్తృతంగా పర్యటించి కూటమి అధికారంలోకి రావడానికి విజయం వైపు నడిపించినందుకు ముఖ్యంగా ధర్మవరంలో సత్య కుమార్ యాదవ్ గెలుపుకు కీలక పాత్ర పోషించినటువంటి జిఎం శేఖర్ ను ఘనంగా సన్మానించారు. రాజకీయాల్లో మరింత ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ప్రజలకు సేవ చేయాలని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూలేరు ప్రభాకర్ స్వామి, మధు సూధన్ రెడ్డి, జస్వంత్, కిరణ్ తదితరులు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లలితకళా పరిషత్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి

### – మధుర గీతాలతో గాన గంధర్వుడికి స్వర నీరాజనం..

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్ లో పద్మశ్రీ బాలసుబ్రమణ్యం జయంతి కార్యక్రమాన్ని తలారి శ్రీనివాస్



ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి ఎల్ కె పి అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, లాయర్ పద్మజ, ఎస్కేయూ మాజీ రిజిస్టర్ ఆచార్య సుధాకర్ బాబు, రాయలసీమ బలిజ మహా సంఘం జిల్లా అధ్యక్షులు శంకరయ్య తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కు పలువురు గాయకులు తమ మధుర గానంతో స్వరనీరాజనం అర్పించారు. పెద్ద సంఖ్యలో సంగీత ప్రియులు పాల్గొన్నారు.

## నాల్గవ సౌత్‌జోన్ మినీ సబ్ జూనియర్ టెన్నిస్ క్రికెట్ ఛాంపియన్ షిప్ ప్రారంభం





అనంతపురం విద్య మేజర్ న్యూస్ : అనంతపురం నీలం సంజీవరెడ్డి స్టేడియం పి టి సి లో శనివారం నాలుగవ సౌత్ జోన్ మినీ సబ్ జూనియర్ టెన్నిస్ క్రికెట్ ఛాంపియన్షిప్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జన బలం బాబా, డిస్కవర్ ఆఫ్ అనంతపురం అనిల్, ఇన్ఫినిటీ చారిటబుల్ చైర్మన్ బద్దె నాయక్, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ డి ప్రసాద్ హాజరయ్యారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రేష్మ అన్వర్ భాష తెలిపారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, తెలంగాణ పాండిచ్చేరి జట్లు పాల్గొన్నాయి.

**క్రీడలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తాం**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో క్రీడాకారులను అలాగే క్రీడలను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. పిటిసి మైదానంలో సౌత్ జోన్ అండర్ 14 బాలబాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ తనకు కూడా క్రికెట్ అంటే చాలా ఇష్టమని... గతంలో క్రికెట్ బాగా ఆడే వాడినని గుర్తు చేసుకున్నారు.

గతంలో ఎన్నికల ప్రచారంకి వచ్చినప్పుడు పిటిసిలో చాలా సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని వాటిని పరిష్కరించే దిశగా ఎంపీ సహకారంతో చర్యలు తీసుకుంటామ న్నారు. క్రీడలకు అలాగే మైదానాల అభివృద్ధికి ఎలాంటి అవసరమైన తనను సంప్రదించాలని.. ప్రభుత్వ సహకారంతో ఖచ్చితంగా వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## అనంతపురం ఎంపీ అంబికాను కలిసిన వాల్మీకి నాయకులు



నల్లచెరువు, మేజర్ న్యూస్ : అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మి నారా యణను శనివారం వారి కార్యలయం లో వాల్మీకి సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిసారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కదిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ చిత్ర పటాన్ని అంద జేస్తూ, దృశ్యాలువలు కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీకి స్వామి వారి ప్రసాదా లు అందజేశారు. ఎంపీ ని కలిసిన వారిలో కదిరి నియోజక వర్గ వాల్మికి సంఘం అధ్యక్షుడు తలారి చలపతి, నాసు నరసిం హులు, వాల్మీకి సేవాధ ల్ రాష్ట్ర యువత అధ్యక్షుడు తలారి మంజునాథ్, కుటా గుల నాగరాజులతో పాటు పలువురు నాయకులు పాల్గొ న్నారు.

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాలపాటీ దీన్ని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఉదయం ఆలయ శుద్ధి, అలంకరణ, ఆకు పూజలు, అభిషేకాలు, అర్చనలు, దూప దీప నైవేద్యాలు సమర్పిం చారు. వివిధ ప్రాంతా లు నుండి భక్తాదులు విచ్చేసి స్వామి వారినీ దర్శించుకున్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు.శ్రీ రామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.



## గోవుల అక్రమ రవాణా అరికట్టాలి

### – విశ్వహిందూ పరిషత్ నాయకులు



తనకల్లు, మేజర్ న్యూస్ : హిందువులు పవి త్రంగా భావించే గోవులను అక్రమ రవాణా తో పాటు పలు ప్రాంతా లలో వధించి మాంస విక్రయాలు జరుగు తున్నాయని , అక్రమ రవాణాను అరిక ట్టాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ నరసిం హులుకు శనివారం విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు సీతక శ్రీనాథ్ మాట్లా డుతూ గోహత్య మహా పాపమని, గోహత్య నిషేధిత చట్టం ఉన్న ప్పటికీ కొందరు గోవుల ను అక్రమ రవాణా చేయడంతో పాటు ఎక్కడపడితే అక్కడ పశువులను వధించ డం మాంసాన్ని విక్ర యించడం జరుగుతు న్నాయని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాలాజీ, సురేష్, నరేష్ తదిత రులు పాల్గొన్నారు.

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి

నల్లచెరువు, మేజర్ న్యూస్ : ముస్లింలు బక్రీద్ పర్వదినం ప్రశాం త వాతావరణంలో జరుపుకోవాలని తహశీల్దార్ రవి కుమార్, యస్ ఐ లింగన్న లు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ యందు ముస్లిం మత పెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం సోమవారం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. గోవధ చేయరాదని అలాంటి పనులు చేపడతే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కలిసి మెలసి సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని అందుకు ప్రజలు సహకరించు కోవాలన్నారు.



# అరాచకాల వల్లే వైసీపీ కనుమరుగైంది

**-కూటమి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం**
**-జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శిచిలకం**




**ధర్మవరం మేజర్ న్యూస్** ప్రభుత్వంలో చేసిన అరాచకాలు, అవినీతి,అక్రమాలు,దౌర్జన్యాల వల్లనే రాష్ట్రంలో వైసీపీ కనుమరుగైందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రజావ్యతిరేక పాలన వల్ల ప్రజలు విసిగిపోయి ఓటు ద్వారా బుద్ధిచెప్పి కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో గెలిపించారన్నారు. కావున ఈ రాష్ట్రం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్తో అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా ధర్మవరం నియోజకవర్గంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్లతో కలిసి సమన్వయం చేసుకుని కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. నేను ఏమి చేశానని ప్రజలు నన్ను ఓడించారని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. త్వరలో వైసీపీకి కూడా పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్లు అధికారంలో ఉంటుందన్నారు.ఇక అతితక్కువ కాలంలో సత్యకుమార్ ధర్మవరంలో రావడం, ఆయనను ప్రజలు నమ్మి ఓట్లువేసి గెలిపిం చారన్నారు.అంతేకాకుండా సత్యకుమార్యాదవ్కు మంత్రి పదవి దక్కించుకున్నం దుకు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.దీంతో ధర్మవరం నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసే విధంగా తామంతా ముందుకెళా బిమన్నారు.ఈ సమావేశంలో జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరిశ్యాం కుమార్, వెంకటరెడ్డి,బాలక్రిష్ణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ద్వారా రక్త బంధం ఆర్గనైజేషన్ సభ్యులకు అవార్డు

**- రక్త బంధం ఆర్గనైజేషన్ అధ్యక్షులు కన్నా వెంకటేష్**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** రక్త బంధం ఆర్గనైజేషన్ సభ్యుడు మహేష్ బాబుకు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపిక, సత్కారం లభించడం సంతోషించదగ్గ విషయమని రక్త బంధం ఆర్గనైజేషన్ అధ్యక్షులు కన్నా వెంకటేష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అనంతపురం పట్టణానికి చెందిన జూటూరుమహేష్ బాబు ఇప్పటివరకు 77 సార్లు రక్తదానం చేయడం జరిగిందని, ప్రపంచ రక్త దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ అధ్యక్షులు డాక్టర్ వినోద్ కుమార్ చేతులు మీదుగా జ్ఞాపిక అందుకొని, ఘనంగా సత్కరించడం, రక్త బంధం ఆర్గనైజేషన్ సంస్థకు మంచి గుర్తింపుతో పాటు మరింత బాధ్యతలు పెంచిందని తెలిపారు. కలెక్టర్ కూడా రక్త బంధం ఆర్గనైజేషన్ సభ్యులను అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. రక్త దాతలుగా రక్త బంధం ఆర్గనైజేషన్లో అడిగిన వెంటనే రక్తమును ఇవ్వడం ఎందరో ప్రాణాలను కాపాడటం గర్వించదగ్గ విషయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలకు విలువ కట్టలేమని వారు స్పష్టం చేశారు. 18 సంవత్సరాల నుండి 45 కేజీల బరువు వరకు ఎవరైనా లింగ బేధం లేకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. యువతి యువకులు ఈ రక్త బంధం ఆర్గనైజేషన్ ను స్ఫూర్తిగా తీసుకొని, మానవతకు సంకేతం అని తెలిపారు. కావున ప్రతి మనిషి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని వారు తెలిపారు. అనంతరం రక్త బంధం ఆర్గనైజేషన్ అధ్యక్షులు కన్నా వెంకటేష్ తో పాటు సభ్యులు కూడా మహేష్ బాబును అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేరుస్తున్న చంద్రబాబు

**- హర్షం వ్యక్తం చేసిన జిల్లా అధ్యక్షులు అంజినప్ప**



**హిందూపురం మేజర్ న్యూస్:-** రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లకు కట్టుబడితొలి 5 సంతకాలతో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై తొలి సంతకాల తో చంద్రబాబు పాలనప్రారంభమైంది అని శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజన్నప్ప వర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు మెరుగైన భవిష్యత్ కోసం పటిష్టమైన విద్యా వ్యవస్థలో భాగంగాఉపాధ్యాయ నియమకాలకు తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.అందులో భాగంగా ఏకంగా 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా 'మెగాడీఎస్సీ'ని ప్రకటిస్తూ.మొదటి సంతకం ఆ ఫైలుపైనే చేశారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అధికారంలోకివచ్చిన వెంటనేరద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు హామీ ఇచ్చారు..ఇచ్చిన హామీ మేరకు రెండో సంతకాన్ని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై చేశారు.పేదల పింఛన్ మొత్తాన్ని రూ.3వేల నుంచి ఒకేసారి రూ.4వేలకు పెంచారు. జూలైలో ఈ 3నెలల బకాయి 3వేలు, పెరిగిన పింఛను రూ.4వేలు కలిపి మొత్తం7వేలు అందించేందుకు మూడో సంతకం చేయడంతో వృద్ధుల్లో బోసినవ్వులు విరబూశాయి.అలాగే దివ్యాంగుల పింఛను రూ.4వేల నుంచి 6 వేలకు పెంచుతున్నాం. వారికిబకాయిలతో కలిపి జూలైలో రూ.12 వేలు అందుతుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగాఎలాంటి నైపుణ్యాలు అవసరమో నైపుణ్య గణన గుర్తిస్తుంది.పోటీకి అనుగుణంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలాయువతకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన సిఫార్సులు చేస్తుంది.నిర్మాణ, ఉత్పత్తి, సేవా రంగాలకు సంబంధించి యువతలో ఏ మేరకు నైపుణ్యాలుఉన్నాయో గుర్తిస్తారు.పరిశ్రమల అవసరాలు, యువతకు మధ్య ఉన్న నైపుణ్య అంతరాన్ని గుర్తించి,అందుకు అనుగుణంగా శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాల్గోవ సంతకం పెట్టి యువతకు మెరుగైన బాట వేశారు. టీడీపీ ప్రభుత్వానికి బ్రాండ్ గా నిలిచిన అన్న క్యాంటీన్లను జగన్ రెడ్డి మూసివేయించారు.అన్న క్యాంటీన్లు ప్రారంభించి దశలవారీగా మిగిలిన వాటిని అందుబాటులోకితేవాలని సీఎం చంద్రబాబు ఉత్తర్వులు విడుదల చేయడం జరిగిందన్నారు. ,ఈ ఐదు సంవత్సరాలలో రాష్ట్ర అభివృద్ధి ధ్యేయగా ఆయన పాటుపడతాడని ఆయన పేర్కొన్నారు.

## పేద బాలికలకు ఇంటర్‌లో ఉచిత విద్యకు అవకాశం

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** చదువులో ప్రతిభ కనబరుస్తూ పేదరికంతో సతమవు తున్న గ్రామీణ పేద బాలికలకు నవ చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి ద్వారా నగరంలోని పీఆర్‌కె కళాశాలలో ఉచిత విద్య అందించనున్నట్లు ఆ సొసైటి చైర్మన్ కె.వీరాంజినేయులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకా రాదని భావించి ఈ కార్యక్రమం చేపడుతు న్నామన్నారు. చదువుకోవాలనే ఆసక్తి, శ్రద్ధ ఉన్న బాలికలకు నగరంలోని మూడవ రోడ్డులో ఉన్న పీఆర్‌కె జూనియర్ కళాశాల మా సంస్థ ఫీజు చెల్లిస్తుందని, హాస్టల్ వసతికి మాత్రం విద్యార్థుల తల్లితండ్రులే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న గ్రామీణ పేద బాలికలు సెల్ నెం. 9441551930, 9121178774కు సంప్రదించాలని తెలిపారు.

## బక్రీదు పండుగను ప్రశాంతం జరుపుకోండి



**ధర్మవరం మేజర్ న్యూస్** సోమవారం బక్రీదు పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని వన్టౌన్ సీఐ సుబ్రమణ్యం సూచించారు. శనివారం స్థానిక వన్ టౌన్ పోలీసు స్టేషన్లో హిందు ముస్లింలను సమావేశం నిర్వ హించారు. ధర్మవరం ప్రశాంతతకు మారుపేరని బక్రీదు పండుగకు కూడా అదేరీతిలో జరుపుకోవడంతోపాటు అందరి సహాయసహకారాలు ముస్లింసోదరులకు అందిం చాలని సీఐ కోరారు. ధర్మవరం ముస్లిం సోదరులు ఈద్గామైదానికి వెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తును ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ముస్లిం సోదరులు నాగూరుస్సేన్,రాళ్లపల్లిషరీఫ్, ఆత్తర్రహీంబాషా, చాంద్ బాషా, ఖలీల్ రెహమాన్,కుళ్లాయప్ప, హిందువులు సాకేఓబుళేశు, జింకాచంద్రశేఖర్, గుండాపుల్లయ్య, చంద్రమౌళి, బిల్లేరవి తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై న్యాయవాదుల హర్షం

**- కోర్టు న్యాయవాదులు**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** ప్రజా కంటక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేయడంపై ధర్మవరం న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం లో న్యాయవాది సుబ్బారావు కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలని మొదట న్యాయవాదులే ఉద్యమం చేపట్టడం జరిగిందని, అంతేకాకుండా రిలే దీక్షలు కూడా చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈ రద్దు రైతులకు ప్రజలందరికీ కూడా ఆమోద్యమోగంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రహమతుల్లా, కృష్ణమోహన్, దుర్గాప్రసాద్, చౌదరి, రవి, బిల్లే నరేంద్ర, గుంటప్ప,అబ్దుల్లా, రంగానాయుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టగుండ్లపల్లిలో 'మన అంగన్వాడీ పిలుస్తోంది'



**గోరంట్ల, మేజర్ న్యూస్ :** గోరంట్ల మండలంలోని పుట్ట గుండ్లపల్లి అంగన్వాడి కేంద్రంలో "మన అంగన్వాడీ పిలోస్తోంది" మరియు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు జరప డమైనది. ఈ కార్యక్ర మంలో భాగంగా మొదట గ్రామంలో ప్రి స్కూల్ పిల్లల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహిం చి 3సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రం నందు చేర్పించాలని కోరడమైనది. తరువాత 5సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే జరపడమైనది. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లితండ్రులను సెంటర్ కు ఆహ్వానించి వారి సమక్షంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించి పిల్లలకు "ప్రి స్కూల్ సర్టిఫికెట్" ప్రధానం చేయడం జరిగింది. తరువాత ఆ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు తీసుకువెళ్ళి పేరు నమోదు చేయించి పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి, ప్రభుత్వ పాఠశాల టీచర్ సురేష్, ఎంఎస్‌కె భారతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి, అంగన్వాడి వర్కర్లు అరుణ, లక్ష్మి బాయి, సాలమ్మ, ఏఎన్ఎం, ఆశా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ధర్మవరం రక్తదాతకు అనంతపురం జిల్లా కలెక్టర్ సత్కారం



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీ చౌడేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో నడిపిస్తున్న రక్తదాన శిబిరాలను మెచ్చి, అనంతపురం జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు వినోద్ కుమార్ బీరే శ్రీరాములకు జ్ఞాపిక తో పాటు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీరే శ్రీరాములు మాట్లాడుతూ తాను శ్రీ చౌడేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో పలు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, రక్తం యొక్క అవసరాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తూ నా బాధ్యతను నిర్వర్తిస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు 16 సార్లు రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగిందని, ఇందులో నాలుగు సార్లు రెడ్ క్రాస్ సంస్థకు రక్తాన్ని ఇవ్వడం జరిగిందని, మరి 12 సార్లు జరిపిన వాటిని స్థానిక, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఇవ్వడం జరిగిందని తెలిపారు. రక్తదాన శిబిరమ్మల నిర్వహణలో తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా, సహాయ సహకారాలు అందించిన రక్త దాతలు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఈ అవార్డు ఈ సత్కారం వారికే అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ చౌడేశ్వరి సేవా సమితి సభ్యులు ఉమ్మడిశెట్టి ప్రసాద్, దాసరి శివ, మేకల శివయ్య, పడిగేరి నాగరాజు తదితరులు బీరే శ్రీరాములకు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

# పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి పని చేద్దాం : ఎమ్మెల్యే పల్లె సింధూర

**పుట్టపర్తి మేజర్ న్యూస్:** పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని అధికారులకు పిలుపునిచ్చారు. పుట్టపర్తిలో శాంతి భద్రతల విషయం లో పోలీసు యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి జీతం పొందే ప్రతి ఉద్యోగి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని,ప్రజల కోసం బాగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. మంచినీటి ట్యాంకులు,మురుగునీటి కాలువలు శుభ్రం చేసేలా క్రింది స్థాయి అధికారులకు ఆదేశాల ఇవ్వాలని ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే సూచించారు. చెరువు గట్లు,కాలువల భద్రత విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని,వాటిలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. రైతులు విత్తన సాగుకు ఇదే సరైన సమయం అని ప్రతి రైతు సకాలంలో పంట సాగు చేసుకునేలా వ్యవసాయ అధికారులు తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఖరీఫ్ లో రైతులకు నాణ్యమైన విత్తన కాయలు అందించాలని ఆదేశించారు. ఓడి చెరువు మండలంలోని తంగేడు కుంట పంచాయతీలో ఉన్న సోత్రీయ భూముల రైతులకు ఆఫ్లైన్ ద్వారా విత్తన వేరుశనగ కాయలు అందించాలని సూచించారు. క్షత్రియ రైతులకు సుమారు 690 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు ఉన్నాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు సుబ్బారావు ఎమ్మెల్యేకి వివరించారు.ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు స్థలాలు మంజూరుకు ఆయా సమీప ప్రాంతాల్లో భూములు సేకరించాలని రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు పరిశ్రమల ఏర్పాటుకు అసైన్డ్ భూములతో పాటు ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. రహదారులు లేని గ్రామాల వివరాలను, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి వివరాలను అందించాలని అధికారులను కోరారు.

# అమ్మకు వందనం ప్రభుత్వ బడి పిల్లలకే అమలు చేయాలి : ఎస్టియు



నంబులపూలకుంట, మేజర్ న్యూస్ : ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మాత్ర మే అమ్మకు వందనం అమలు చేయాలని ఎస్టియు జిల్లా అధ్య క్షులు హరి ప్రసాద్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సమావేశం సందర్భంగా ఎస్ టి యు జిల్లా అధ్యక్షు లు హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా ప్రతి పిల్లవానికి 15వేలు ఇస్తున్నదని, పిల్లలను బడిబాట పట్టించే కార్యక్రమంలో భాగంగా ఈ అమ్మకు వందనం ప్రభుత్వ బడులలో చదివే పిల్లలకు మాత్రమే ఇవ్వా లని, దీనివలన ప్రభు త్వ పాఠశాలల్లో పిల్లల ఎన్రోల్మెంట్ పెరిగి ప్రభుత్వ బడులు బలో పేతమౌతాయని పేర్కొ న్నారు. ఇంగ్లీష్ మీడి యం కు సమాంత రంగా తెలుగు మీడియం ప్రవేశపెట్టా లన్నారు. ప్రభుత్వ బడులలో నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని, విద్యా ర్థి కిట్, పోషక విలువ లతో కూడిన మధ్యా హ్న భోజనం, ఆహ్లాద కరమైన వాతావరణం లో సామర్థ్యాధార బోధన, డిజిటల్ క్లాస్ రూమ్ లు, క్రీడలు అందుతున్న దరిమిలా ప్రభుత్వ బడుల బలోపేతం దృష్ట్యా అమ్మకు వందనం ప్రభుత్వ బడి పిల్లలకు మాత్రమే అమలు చేయాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం చేసిన 117 జీవో రద్దు చేయాలని, సిపిఎస్ రద్దు చేసే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టి యు జిల్లా గౌరవ అధ్యక్షులు రామంజులు యాదవ్, జిల్లా కౌన్సిలర్ ఐ.వి. రమణ నాయక్, షరీఫ్, రహీమ్, రమణయ్య ,వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ. 3.13 లక్షలు పలికిన నల్లమాడ వారపు సంత



నల్లమాడ, మేజర్ న్యూస్ : మేజర్ పంచాయతీ నల్లమాడ వారపు సంత శనివారం పంచా యతీ కార్యాలయంలో సర్పంచ్ రామావత్ భారతి బాయి అధ్యక్ష తన వేలంపాట నిర్వ హించారు.ఈ వేలం పాటలో 30 మంది పాట దారులు పాల్గొని, 20 వేలు రూపాయలు వంతున ధరావత్ చెల్లించారు. నల్లమాడ గ్రామానికి చెందిన హరీష్ అనే పాట దారుడు అందరికన్నా అధిక మొత్తంలో రూ. 3.13 లక్షలకు వేలంపాటను దక్కించు కున్నారు. దీంతో హెచ్చు పాట దారుడు హరీష్ కావడంతోనే 41 వారపు సంతలు కాలంవ్యాధితో సంతను నిర్వహించు కోవచ్చునున్నారు. గతము కన్నా ఈ ఏడాది వారపు సంతకు 13000 రూపాయలు అదనపు ఆదాయం సమకూరినట్లయితే గతంలో మూడు లక్షల రూపాయలు కాగా ఈ ఏడాది మూడు లక్షల 13 వేల రూపాయలు సంత వేలంపాట దారు లు పాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమావతి భారతి, పంచాయతీ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, గ్రామ ప్రజలు ఉన్నారు.

# సమయపాలనపై సమీక్షించిన జిల్లా ప్రజా రవాణా అధికారి



కదిరి, మేజర్ న్యూస్ : కదిరి డిపో నందు ఏపిఎస్ ఆర్టీసీ బస్సుల సమయ పాలన పైన శని వారం కదిరి డిపో మేనేజరు, సూపర్వైజర్లతో జిల్లా ప్రజార వాణా అధికారి టి.మధుసూదన్ డిపో మేనేజరు ఛాంబర్ లో సమీక్షించారు. ప్రయా ణికులకు అనుకున్న సమయం లోనే గమ్య స్థానము చేర్చాలని, అలాగే బస్సులను కూడ టైం టేబుల్ ప్రకారము బస్టాండు నుండి బస్సులు నడ పాలని, సమయ పాలన పాటించుటకు తీసుకోవసిన చర్యను డిపో మేనేజరు బి.మై నోద్దిన్ ను తెలియ జేసారు. కదిరి నుండి బెంగుళూరు, అనంతపురము, తిరుపతి, హైదరాబాదు, విజయ వాడ రూట్ల సమ యపాలన పరిశీలిం చారు. బస్సుల మర మ్మత్తులకై తగిన సమయం ఇచ్చి, సమయపాలన పాటింప చేయాలని గ్యారేజి ఇన్-చార్జి రామక్రిష్ణకు ఆదేశించారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్ పాల్గొన్నారు.

# సచివాలయాలకు ఎన్టీఆర్, ముఖ్యమంత్రి ఫోటోలను అందజేసిన ఉపాధ్యాయుడు

నల్లమాడ, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టి ముఖ్యమం త్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం తరువాత గ్రామ సచివాల యాలుకు దివంగత నేత నందమూరి తారకరామారావు, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఫోటోలను సచివాల యంలో ఆయా గ్రామ కార్యదర్శులకు అందజేసినట్లు కుటాలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు అందజేయడం జరిగింద న్నారు. దీంతో తెలు గుదేశం పార్టీ అభిమా నులు ఎన్టీఆర్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోలు సచివాలయంలో ఏర్పాటు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.





# తిలక్‌నగర్‌లో అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం

లేపాక్షి మేజర్ న్యూస్: లేపాక్షి మండల పరిధిలోని కంచిసముద్రం సెక్టార్ లోని తిలక్ నగర్ లో శనివారం నాడు అంగన్వాడీ పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సీడీపీఓ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడమైనది.ఈ సందర్భంగా గర్భవతులు, 0-6 సంవత్సరాల పిల్లల తల్లులను సమావేశపరిచి వారికి పూర్వప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురుంచి అవగాహన కల్పించడమైనది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ద్వారా పిల్లల శారీరక, మానసిక, శాంగిక, మేధాశక్తి అభివృద్ధి గురుంచి అవగాహన కల్పించడమైనది. అనంతరం అంగన్వాడీ ముద్దు-కాన్వెంట్ వద్దు,అంగన్వాడీ విద్య-ఆటపాటల విద్య అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలో సూపర్వైజర్ పి.జయమ్మ , అంగన్వాడీ కార్యకర్త వసుంధర తదితరులు పాల్గొన్నారు.

# 22న అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు..

కదిరి, మేజర్ న్యూస్ : తమిళనాడు రాష్ట్రం లోని అరుణాచలం పుణ్యక్షేత్రం కు ఈ నెల 22న పౌర్ణమి సందర్బ ముగా గిరిప్రదక్షిణ కొరకు కదిరి పట్టణ పరి సరములు భక్తాదుల కోరిక మేరకు 21న శుక్రవారం ఉదయం 9.00 గంటలకు కదిరి బస్టాండు నుండి ప్రత్యే క బస్సులు నడపబ డునని కదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. ఈ బస్సు లు కాణిపాకం, కంచి, స్వర్ణ దేవాలయం లను కూడ భక్తాదులకు చూపించబడును. ఎక్స్-ప్రెస్ బస్సులలో పెద్దలకు రూ.1050.00 లను, సూపర్ లగ్జరీ లో రూ.1300.00 చార్జిగా వసూలు చేయబ డును. ఆన్ లైన్ నెంబరు: 905253 7054 ద్వారా కూడ టిక్కెట్టును ఫోన్ పే ద్వారా కూడ బుక్ చేసుకోవచ్చునని డిపో మేనేజరు మైనోద్దీన్ తెలిపారు. కావున భక్తాదులు ఈ సదుపాయం ను ఉపయోగించుకోవాలని అసిస్టెంట్ మేనేజరు హరిత, హరిమోహన్ లు కోరారు.




# మాట నిలబెట్టుకున్న ఎన్డీఏ ప్రభుత్వం..

### - మెగా డిఎస్సి పై మొదటి సంతకం పెట్టటంపై హర్షం..

### - బిజెపి జిల్లా గ్రంధాలయ్ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్..

తాడిపత్రి మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డిఎస్సి పై మొదటి సంతకం చేస్తామన్నా హామీ నీ నెరవేరుస్తూ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు మెగా డిఎస్సి పై మొదటి సంతకం చెయ్యటం పై హర్షం వ్యక్తం చేస్తున్నామని బీజేపీ జిల్లా గ్రంధాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్ ఒక ప్రకటన లో పేర్కొ న్నారు. ఏపీలో ఉద్యోగాల వెల్లువమొదలైందని, నిరుద్యోగుల ఐదేళ్ళ కష్టాలు తీరేలా ఏకంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం తో నిరుద్యోగ యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారనీ అన్నారు.



వైస్సార్సీపీ ప్రభుత్వం లో ఐదేల్ల పాటు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూసి చూసి విసుగు చెంది, 2024 సార్వాత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి నిరుద్యోగ యువత, రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని అన్నారు. రాష్ట్ర నిరుద్యోగ యువత ఆకాంక్ష ల మేరకు నూతన రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఉద్యోగాల భర్తీకి సిద్ధంగా ఉందని అన్నారు.వైస్సార్సీపీ ప్రభుత్వనికి ఎన్డీఏ ప్రభుత్వానికి స్పష్ట మైన తేడా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు అందరూ కూడా ఉద్యోగస్తులుగా తయారు అవుతారని ఆకాంక్షిస్తున్నామని తెలియజేసారు.

# సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలకు సర్వం సిద్ధం

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి**

**అనంతపురం బ్యూరో మేజర్ న్యూస్ :** జిల్లాలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు - 2024ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు - 2024 నేపథ్యంలో శనివారం అనంత పురం కలెక్టరేట్ లోని ట్రెజరీ కార్యాలయంలో ఉన్న ప్రశ్న పత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలను సజావుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలను జూన్ 16వ తేదీన ఆదివారం నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలకు 2,795 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. జూన్ 16వ తేదీన ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 7 వెన్యూ కేంద్రాలలో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను సకాలంలో పటిష్ట భద్రత మధ్య తరలించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని, మొబైల్ టాయిలెట్స్, మెడికల్ టీంలను ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా పరీక్ష కేంద్రాలకు కల్పించడం లాంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాల న్నారు. పరీక్షా కేంద్రంలోకి ప్రవేశం సెషన్ ప్రారంభానికి 30 నిమిషాల ముందు ముగుస్తుందన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు - 2024 కోసం అనంతపురం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (నెంబర్ 8500292992) ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి. రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పు డైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116

# బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

## – నగర మేయర్ మహమ్మద్ వసీం..



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరం లోని ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగర మేయర్ మహమ్మద్ వసీం నగరంలోని హౌసింగ్ బోర్డ్ ఈద్గా మైదానాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఈద్గా మైదానంలో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఈద్గా మైదానంలో పారిశుద్ధ్య నిర్వహణ,నీటి సౌకర్యం కల్పన,నమాజ్ కు అవసరమైన సౌకర్యాలు వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్,అభూ సాలెహ,,ఇషాక్,రహంతుల్లా,,కో అప్షన్ సభ్యులు శంషుద్దీన్,వైసీపీ నాయకులు ఖాగజ్ ఘర్ రిజ్వాన్,దాదు,దాదా ఖలేందర్ ,రియాజ్,ఎమ్ హెచ్ ఓ విష్ణుమూర్తి,శానిటరీ ఇన్స్పెక్టర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

# లేపాక్షి ఆలయ హుండీ లెక్కింపు..



లేపాక్షి మేజర్ న్యూస్: మండల కేంద్రమైన లేపాక్షి గ్రామంలో వెలిసిఉన్న శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో శనివారం నాడు స్వామి వారి శాశ్వత ఉండి లెక్కింపు కార్యక్రమం జరిగింది. అయితే 105 రోజులకు గాను హుండీ లో నగదు రూ.4,47,374 వచ్చినది సదరు హుండీ పర్యవేక్షణ అధికారి శ్రీ సత్యసాయి జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి.నరసింహరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎమ్.హెచ్.నరసింహమూర్తి ,ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, కమిటీ సభ్యులు నాగరాజు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో కింది మండలాల్లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.
పెనుకొండ ఇన్‌చార్జ్, పెనుకొండ టౌన్,
పెనుకొండ రూరల్, పరిగి



# విద్యార్థినులకు మంచాలు ఏర్పాటు చేయండి

## – జడ్పీ సీఈఓ నిదియాదేవి

పామిడి, మేజర్ న్యూస్ : కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినిలకు మం చాలు, పరుపులు ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈఓ, సమగ్ర శిక్షా అభియాన్ అడిష నల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ నిదియాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశా లను శనివారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏయే తరగతిలో ఎంతెంత మంది విద్యార్థినిలు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే తరగతి గదులు, డైనింగ్ హాలు, డార్మెంటరీలు, వాటర్ ప్లాంటు, పరిసర ప్రాంతాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆడుకుంటున్న విద్యార్థినిలతో ముచ్చటించారు. ఒక్కొక్కరిని పరిచయం చేసుకున్నారు. విద్యాభ్యాసం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ సోదరి భావనతో మెలగాలని సూచించారు. ఏవైనా సమస్యలున్నాయా.. అని అడిగారు. పాఠశాలలో తరగతి గదులకు బోర్డులు, నీతి సూక్తులు, డ్రాయింగ్స్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపాఠశా లలోనూ తరగతి గదులకు బోర్డులు రాయించాలని ఎంఈఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున, ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ, కేజీబీవీ స్పెషలాఫీసర్ సౌభాగ్య, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత వైద్యంతో ఆరోగ్యానికి నష్టం

## – అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : సొంత వైద్యంతో ఆరోగ్యానికి చాలా నష్టం వాటిల్లుతుందని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెడికల్ కళాశాల నేతృత్వంలో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో సొంత వైద్యంతో జరిగే అనర్ధాల గురించి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఇష్టానుసారంగా సొంత వైద్యం తో అనేక అర్థాలు ఉన్నాయి అని తెలిపారు. వీటి వల్ల శరీరం లో అవయవాలు పూర్తిగా పనిచేయకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. వైద్య విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.



# ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

నల్లమాడ, మేజర్ న్యూస్ :సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజక వర్గ నల్లమాడ మండ ల తెదేపా నాయకులు శనివారం పుట్టపర్తి నియోజకవర్గ మొట్ట మొదటి మహిళా శాసన సభ్యురాలు గా గెలుపొందిన శుభ సందర్భాన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. నూతన ఎమ్మెల్యేకి పూల బొకేయాల నందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండ ల కన్వీనర్ మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయు డు, తెలుగు యూత్ నాయకులు శివ ప్రసా ద్ రెడ్డి పుట్ల రవీంద్ర, మైలే రామచంద్ర, మారాల చెన్నారెడ్డి, ఎం రవికుమార్, కేబి మంజునాథరెడ్డి ,డి హనుమంత్ రెడ్డి, ఎన్ నాగేంద్ర, పల్లపు శ్రీరాములు, జై శ్రీనివాసులు, అరవింద్ బాబు, మాజీ డీలర్ శంకర, బుజ్జి నాయక్,తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



## నారాయణ కళాశాల వద్ద
# వామపక్ష విద్యార్థి సంఘాల ధర్నా

అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : ఇంటర్మీడియట్ కోర్సులు, పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బస్టాండ్ వద్ద ఉన్న నారాయణ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. కళాశాలలో నిల్వ చేసిన పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ ,ఐసారాష్ట్ర అధ్యక్షులు వేమన, పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర , పిడిఎస్‌యు జిల్లా కోశాధికారి బండారు శంకర్ లు నారాయణ విద్యాసంస్థలో పుస్తకాల ను రూ. 12 వేలు నుండి రూ. 15, వేలు వరకు విక్రయిస్తూ నిలువు దోపిడి చేస్తున్నా యని ఆర్ఐవో దృష్టికి తీసుకెళ్లి పుస్తకాల రూమ్‌ను సీజ్ చేయించారు. నారాయణ, చైతన్య విద్యా సంస్థల అధిక ఫీజుల వసూలు చర్యలు తీసుకోకపోతే దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలు, నరేంద్ర పాల్గొన్నారు.

## శిలాఫలకాలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు : డీఎస్పీ



తాడిపత్రి మేజర్ న్యూస్ : శిలాఫలకాలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తాడిపత్రి డిఎస్పి జనార్ధన్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా తాడపత్రి పట్టణ పోలీస్ స్టేషన్లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిలాఫలకాలు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. రాజకీయ కక్ష సాధింపులతో శిలాఫలకాలు ధ్వంసం చేయడం వల్ల ప్రభుత్వ ఆస్తికి నష్టం కలుగుతుందన్నారు. ఇలాంటి చర్యలు కు పాల్పడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే వివిధ ఘర్షణలకు పాల్పడిన 41 మందిపై బండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. క్షణికావేశంలో చేసిన అల్లర్లకు జీవితాంతం బైండోవర్ కేసులతో భరించాల్సి వస్తుందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించకుండా నడుచుకోవాలన్నారు.

### పట్టణంలోకి భారీ వాహనాలు బంద్

పట్టణంలోకి భారీ వాహనాల ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు ప్రవేశించడంతో ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయం ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని ఉద్దేశంతో పట్టణం ఇరువైపులా పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి భారీ వాహనాలను బైపాస్ లోకి మళ్ళించడం కోసం త్వరలో జరుగుతుందన్నారు.

## శాంతి భద్రతకు విఘాతం కల్పిస్తే కేసులు నమోదు చేస్తాం - ఎస్సై శివ

బెలుగుప్ప, మేజర్ న్యూస్ : జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు శాంతి భద్రతకు విఘాతం కల్పిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శివ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ మాట్లాడుతూ మండలంలోని ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలు, అన్ని పార్టీల నాయకులు సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘ చేపట్టమన్నారు కానీ మండలంలో ఎర్రగుడి, గంగవరం గ్రామంలో రెండు సంఘటనలు చోటుచేసుకున్నాయని, ఎర్రగుడి గ్రామంలో ఇద్దరి మీద, కాలువపల్లి గ్రామంలో నలుగురు మీద కేసులు నమోదు చేసి బైండోవర్ చేయడం జరిగిందన్నారు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన, ప్రజలకుశాంతికి భంగం కలిగించిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వారిపై కేసు నమోదు చేసి రౌడీషీటర్ ఓపెన్ చేస్తామన్నారు. ముఖ్యంగా మండలంలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొని రావాలని, భూతగాదాలు కాని ఏలాంటి సమస్యలు ఉన్న అనవసరంగా తగాదాలు పెట్టుకోకుండా శాంతియుతంగా పోలీస్ స్టేషన్లో పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై పరిరక్షణ చేపట్టే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు చేపట్టారని ప్రతి గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీలో అన్ని వర్గాలకు సంబంధించిన వారిని, మరి అన్ని పార్టీల కుసంబంధించిన వారిని, గ్రామ సచివాలయ సిబ్బందిని సభ్యులుగా పెట్టడం జరిగిందన్నారు, కావున ప్రజలకు ఏమైనా సమస్యలుంటే మాకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామదాసు పాల్గొన్నారు.



# దళిత మహిళ ఎమ్మెల్యేకు హోంమంత్రి పదవి ఇవ్వడం హర్షనీయం

**– ఎస్సీ, ఎస్టీ ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి – జిల్లా దళిత సంఘాలు**



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ మంత్రి వర్గంలో దళిత మహిళ ఎమ్మెల్యే వగలపూడి అనితకు రాష్ట్రహోంమంత్రి పదవీ ఇచ్చి ఎస్సీ,ఎస్టీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కల్పించడం హర్షనీయమని జిల్లా దళిత సంఘాల నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో దళిత సంఘాల నాయకులు బీసీఆర్ దాస్, కెపీ నారాయణస్వామి, బంగి నాగ, దాసగానిపల్లి కుళ్లాయప్ప, తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన దాడులు, వేధింపులు, కుల వివక్షకు, ప్రశ్నిస్తే దళితులను హత్య కూడా చేశారన్నారు. ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి దూరం చేశారన్నారు. దాదాపు 28 ఎస్సీ,ఎస్టీ సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. దీంతో ఎస్సీ,ఎస్టీ ప్రజలు విసిగిపోయి 2024 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారన్నారు. టిడిపికి ఓట్లు వేసి ఘన విజయం అందించారన్నారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోని మెజారిటి టిడిపి అభ్యర్థులను గెలిపించారని తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో వగలపూడి అనితను అనేక ఇబ్బందులు పెట్టిందని, వ్యక్తిగత విమర్శలు చేశారన్నారు. చివరకు అమె అన్నింటిని ఎదుర్కొని నేడు రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిందన్నారు. చంద్రబాబు క్యాబినెట్‌లో దళితులకు పెద్దపీట వేశారని కొనియాడారు. రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. గతంలో ఎస్సీ,ఎస్టీలకు రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నింటిని పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిపాలనాదక్షుడు చంద్రబాబు నాయుడు...

**– ఇచ్చిన మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి...**
**– తొలి అయిదు సంతకాలతో రాష్ట్రంలో సుపరిపాలన..**
**– టిడిపి జిల్లా కార్యాలయంలో నేతల సంబరాలు...**



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ సచివాలయం లో బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం 5 హామీల ఫైళ్ళ పై సంతకాలు చేసిన సందర్భంగా శనివారం రాంనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపూర్ పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొలి ఐదు సంతకాలతో ప్రజలకు ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నాయుడు నిలుపుకున్నారన్నారు. ఈ హామీల సంతకంతో చంద్రబాబు సుపరి పాలన మళ్ళీ రాష్ట్రంలో మొదలైందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి 16,347 టీచర్ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకోవడం తో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేయడంతో రైతులు, ప్రజల కళ్లలో ఆనంద భాష్పాలు వెల్లువెత్తాయని, సామాజిక భద్రతా పెన్షన్లు రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం చేయడంతో అవ్వ తాతలు మా పెద్ద కొడుకుగా చంద్రబాబు నాయుడు ని నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులు, విద్యార్థులు, ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్ర బాబు నాయుడు తప్పకుండా నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి గారు, జేఎల్ మురళి, రాయల మురళి, అనంతపూర్ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు స్వరూప, ఏడిసిసి బ్యాంక్ మాజీ అధ్యక్షులు సరిపోటి సూర్యనారాయణ, రాష్ట్ర గాండ్ల సాధికార సమితి అధ్యక్షులు గాండ్ల విశాలాక్షి, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మొద్దీన్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, సీనియర్ నాయకులు నాగన్న, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు వివిధ అనుబంధ సంఘ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# దొంగే దొంగ అన్నట్లు వైకాపా నాయకుల తీరు

**– అధికారంలో ఉన్నప్పుడు చేసిన అకృత్యాలు, వ్యక్తిగత దూషణలు మరచిపోయారా?**

**– వైకాపా నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి – సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్**



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్: దొంగే.. దొంగ అని అరిచినట్లు రాష్ట్రంలో వైకాపా నాయకుల తీరు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్ పేర్కొన్నారు.ఇటీవల మాజీ మంత్రి కొడాలినాని, ఎంపీ గోరంట్ల మాధవ్ తెదేపా ప్రభుత్వం, నాయకులపై చేస్తున్న విమర్శలపై స్పందించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైకాపా నాయకులు అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అన్న సంగతి మర్చిపోయి వీధి రౌడీల్లా ప్రవర్తించారని ఆరోపించారు.కొడాలినాని, గోరంట్ల మాధవ్లు అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి నానా దుర్భాషలు, వ్యక్తిగత దూషణలు చేసి అవమానించారని, ఒకసారి సదరు నాయకులు వాటిని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, వారి కుటుంబ సభ్యులను కించపరిచి అవమానకర రీతిలోమాట్లాడినపుడు వారు ఎంతగా బాధప డి ఉంటారని ప్రశ్నించారు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన వైద్యుడు సుధాకర్ను పిచ్చివాడిగా ముద్రించి పోలీసుల చేతకొట్టించి మరీ చంపేశారని, అలాగే ఎమ్మెల్సీ అనంతబాబు తన కారుడ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేశాడని ఆరోపించారు. వైకాపా ఎంపీ రఘురామకృష్ణంరాజు, తెదేపా నేత అచ్చెన్నాయుడులను పోలీసుల చేత అరెస్టు తీవ్రంగా దాడి హింసించారని, మాచర్లలో తెదేపా కార్యకర్త తోట చంద్రయ్యను పట్టపగలు వైకాపాగూండాలు గొంతు కోసి హత్య చేశారన్నారు. ఇన్ని అకృత్యాలు చేసిన వైకాపా నాయకులు ..అధికారం కోల్పోయాక తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని గగ్గోలు పెడుతున్నా రని విమర్శించారు. అధికారమదంతో కన్నుమిన్ను గానక ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన వారికి తగిన శాస్తి జరగాలని కోరారు.ప్రతిపక్షంలో ఉన్న ప్రజాప్రతినిధులనే కాకుండా, వారి తీరును ఖండించిన కమ్యూనిస్టు, ప్రజా సంఘాల నాయకులను కూడా అసభ్య పదజాలంతో విరుచుకు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు పశ్చాత్తపంతో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో దౌర్జన్యాలు,అక్రమాలకు పాల్పడినవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టపరంగా శిక్షించాలని జగదీశ్ నూతనంగా ఏర్పడిన తెదేపా ప్రభుత్వాన్ని కోరారు.

# వైయస్సార్ పెన్షన్ కానుక ఇకనుంచి.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌గా కొనసాగింపు

## – ఉరవకొండ ఎంపీడీవో సుబ్బరాజు



ఉరవకొండ, మేజర్ న్యూస్ : గత ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు అందించే వైఎస్ఆర్ పెన్షన్ కానుక ఇక నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ గా కొనసాగుతుందని ఉరవకొండ ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులకు ఎంపీడీవో సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం కు సంబంధించి విధి విధానాలను వివరించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అందించే వైయస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం గా మార్చినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పింఛను రూ. 4వేలకు పెంచినట్లు తెలిపారు. గత ఏప్రిల్ నుంచి పింఛను పెంపు వర్తిస్తుందని, ఏప్రిల్, మే, జూన్ నెలలో బకాయిలు రూ వెయ్యి చొప్పున మొత్తం రూ. 3వేలు, జూలై నెల పింఛను రూ. 4వేలు కలిపి మొత్తం రూ. 7వేలను జూలైలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్నట్లు అవగాహన కల్పించారు. దివ్యాంగుల పింఛను కూడా రూ. 6వేలకు పెంచినట్లు, వారికి బకాయిలతో కలిపి జూలైలో రూ. 12వేలు పంపిణీ చేస్తున్నట్లు సంక్షేమ విద్యా సహాయకులకు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. సిబ్బంది పింఛన్ల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు చోటు లేకుండా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి జయరాములు, సంక్షేమ విద్యా సహాయకులు సాయిరాం నాయక్, జనార్ధన్, మల్లికార్జున, సాయి కృష్ణ, తిప్పేస్వామి, దుర్గాప్రసాద్, శిల్ప, పద్మప్రియ, సునీత, రేఖ, అనిల్ కుమార్, హరికృష్ణ, పవన కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కాలవకు ఆత్మీయ సన్మానం



రాయదుర్గం, మేజర్ న్యూస్ : రాయదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన కాలవ శ్రీనివాసులు విజయవాడ లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు కృతజ్ఞతలు తెలిపి రాయదుర్గం విచ్చేసిన సందర్భంగా తెలుగు తమ్ముళ్లు ఆత్మీయ సంఘీ భావ ర్యాలీ నిర్వహించారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహం నుండి ఆత్మీయ సంఘీభావ ర్యాలీ వినాయక సర్కిల్ మీదుగా రాయదుర్గం పట్టణంలో సాగింది. ఈ నేపథ్యంలో రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప ఆ సేవాసమితి ఉపాధ్యక్షుడు మనకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప సభ్యులు, మిత్రులతో కలిసి పట్టణంలోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ సమీపంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ కలయికతో సన్మానించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు కాలవతో మాట్లాడుతూ ముందుగా ఆయన విజయంపై కృతజ్ఞతలు తెలిపి ఆత్మీయ పలకరింపుతో ఆయనతో ముచ్చటించారు. ఉభయ అనంతపు రం జిల్లాలో రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మిమ్మల్ని ఆదరించి తోడుగా నిలిచి ఇప్పటిదాకా ఎవరికి అందని అత్యధిక మెజారిటీతో ఘన విజయం అందించారన్నారు. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మీరు కూడా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మంచి పాలన అందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసి ప్రజల మన్ననలు అందుకుం టూ మీ రాజకీయ ప్రయాణం ముందుకు సాగించాలని ఆయన ఈ సందర్భంగా కాలవకు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆ సేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, సభ్యులు సిద్ధలింగప్ప, హనుమంతు, గుండా మేస్త్రి మారెన్న, అజయ్ టైలర్ రఘు, పవర్ ఏరిస్వామి, మిత్రులు లక్ష్మీనారాయణ దేవాలయ కమిటీ అధ్యక్షులు గెల్లి రామరాజు, చిరు వ్యాపారి గాజుల భీమరాజులు, విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్ శ్రీ లక్ష్మీ నారాయణ హమాలి యూనియన్ సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, సభ్యులు బండి నాగరాజు, దేవేంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.